క్లుప్తంగా

వైద్యరంగంలో నర్సుల పాత్ర కీలకం



కోవూరు : వైద్యరంగంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ విజేత తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పనిచేస్తున్న 15 మంది నర్సులను ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నర్సులు చూపుతున్న ప్రేమానురాగాలు మరువలేనివన్నారు. తొలుత నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

ఘనంగా మాతృ దినోత్సవం



ఆత్మకూరు : పట్టణానికి చెందిన శ్రీవాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులోని ఎస్ఎస్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లలు వారి తల్లిదండ్రులకు పాదసేవ, పూజా కార్యక్రమాలు చేశారు. తల్లిదండ్రులను గౌరవించాలని, ముఖ్యంగా తల్లి ఆశీర్వాదం పిల్లలు పొందాలని క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

రామానుజాచార్యుల జీవితం ఆదర్శప్రాయం

నెల్లూరు(బృందావనం): భగవద్రామానుజాచార్యుల జీవితం ఆదర్శప్రాయమని సామాజిక సమరసత వేదిక జిల్లా నిర్వాహకుడు కోడూరు సత్యం తెలిపారు. జిల్లా సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో రంగనాయకులపేటలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం సమీపంలో ఉన్న రామానుజాచార్యుల విగ్రహం వద్ద ఆదివారం భగవద్రామానుజాచార్యుల జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలుత రామానుజాచార్యుల విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అలాగే అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో రామానుజాచార్యుల జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రంగనాయకులపేటలోని రామానుజాచార్యుల విగ్రహానికి పూలమాల వేసి ప్రణమిల్లారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

కనులపండువగా శ్వేతఛత్ర ఉత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శ్రీభగవద్రామానుజాచార్యుల తిరునక్షత్రం సందర్భంగా ఆదివారం బంగారు పల్లకిలో శ్వేతఛత్ర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం మంగళాశాసనోత్సవం జరిగింది. తదుపరి ఆలయ అర్చకులు శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామికి, శ్రీభగవద్రామానుజాచార్యులకు శాస్త్రోక్తంగా విశేష తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు పెద్ద శేషవాహన ఉత్సవం, శ్రీభగవద్రామానుజాచార్యులకు ఉడయవర్లు తిరిచ్చిలో పేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో రెడ్ల ఐక్యవేదిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత ఇటీవల మృతిచెందిన జేఎస్‌రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. అనంతరం జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులైన రెడ్డి సంఘీయులు, కళాకారులు, కవులు, రచయితలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 591 మార్కులు సాధించిన నెల్లూరుకు చెందిన ఊటుకూరు చరణ్‌కుమార్‌రెడ్డికి ప్రోత్సాహకంగా వెందోటి ధనుంజయరెడ్డి రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో రెడ్ల ఐక్యవేదిక నిర్వాహకులు నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బీవీ రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, వెందోటి ధనుంజయరెడ్డి, సంఘమిత్ర రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

తుది సమరం నేడు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో సోమవారం జరగనున్న పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, నాయకులు, కార్యకర్తలు కాళ్లు అరిగేలా ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఉదయగిరి నియోజకవర్గంలో ప్రధానంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ మధ్యనే పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో ఓటరు మహాశయులు ఎవరిని కరుణిస్తారో వేచి చూడాల్సిందే.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

ఉదయగిరి నియోజకవర్గంలోని 323 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. ఉదయం ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. ఎన్నికల విధుల్లో 1,938 మంది పోలింగ్ సిబ్బందితో పాటు ఒక డీఎస్పీ, 8 మంది సీఐలు, మరో 8 మంది ఎస్సైలు, 450 మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటున్నారు.

స్వేచ్ఛగా ఓటేసేందుకు అన్ని ఏర్పాట్లు

ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్ రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ఆరు గంటల వరకు క్యూలో ఉన్న అందరికీ ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు.



ఉదయగిరి: పోలింగ్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళుతున్న పోలింగ్ సిబ్బంది



కావలి: పోలింగ్ సామగ్రి తీసుకునేందుకు తరలివచ్చిన పోలింగ్ సిబ్బంది



కావలి: పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న పోలింగ్ సిబ్బంది

నియోజకవర్గంలో 2,41,677 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని చెప్పారు. వీరిలో పురుషులు 1,19,920, మహిళలు 1,21,738, ఇతరులు పది మంది ఉన్నారని తెలిపారు. సీతారామపురంలో 19,260, ఉదయగిరిలో 30,264, వరికుంటపాడులో 25,925,, దుత్తలూరులో 22,591, వింజమూరులో 33,369, కొండాపురంలో 34,591, కలిగిరిలో 37,963, జలదంకిలో 37,814 మంది చొప్పున ఓటును వినియోగించుకోనున్నారని వివరించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

ఉదయగిరి నియోజకవర్గంలో 323 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అందులో 48 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు సీఐ గిరిబాబు తెలిపారు. ఆయా కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు ఒక డీఎస్పీ, 8 మంది సీఐలు, 450 మంది పోలీసు, సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాగా ఉదయగిరిలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ సందర్శించారు. నియోజకవర్గంలోని పరిస్థితులను ఆర్వోను అడిగి తెలుసుకున్నారు. అబ్జర్వర్ రామ్‌కుమార్ గౌతమ్ కూడా కేంద్రాన్ని పరిశీలించారు. ఉదయగిరి నియోజకవర్గాన్ని 41 రూట్లుగా విభజించి ప్రత్యేక మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కావలి: కావలి నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం కావలిలోని క్రీడామైదానంలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం పోలింగ్ సిబ్బంది ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. కావలి నియోజకవర్గంలో సుమారు 2.38 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా కావలి పట్టణం, మండలం, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల్లో మొత్తం 314 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 742 మంది పీఓలు, ఏపీఓలు, 1424 మంది ఓపీఓలతో పాటు 105 మంది మైక్రోఅబ్జర్వర్లు పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. 70 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించనున్నారు. మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్ ప్రక్రియను రికార్డు చేయనున్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన 91 పోలింగ్ కేంద్రాలపై మైక్రోఅబ్జర్వర్ల నిఘా ఉంచారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈదఫా పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గడిచిన రెండు నెలలుగా ఓటు హక్కు వినియోగంపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ద్వారా ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. దీంతో 90 శాతానికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇప్పటికే నాలుగు వేల మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా వేసవి తీవ్రత దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, సిబ్బంది వడదెబ్బకు గురికాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. షామియానాలతో పాటు తాగునీరు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

అల్లూరు: మండలంలోని 57 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు నీడ కోసం షామియానాలు, ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.



అల్లూరు: పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది



కావలి: పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది



ఉదయగిరి: ఆర్వోతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్



ఉదయగిరి: పోలింగ్ సామగ్రితో బస్సు కోసం వేచిచూస్తున్న పోలింగ్ సిబ్బంది



కావలి: ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న ఆర్వో శీనానాయక్

నిర్భయంగా ఓటును వినియోగించుకోండి

కావలి: కావలి నియోజకవర్గ ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. కావలిలోని క్రీడామైదానంలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా శాఖాపరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలింగ్ పూర్తయ్యే వరకూ నిరంతర నిఘా ఉంచనున్నట్లు వివరించారు. ఓటర్లు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

ఎన్నికల ప్రక్రియకు పక్కాగా ఏర్పాట్లు

కావలి ఆర్వో శీనానాయక్

కావలి: కావలి నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టినట్లు కావలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీకే శీనానాయక్ తెలిపారు. కావలిలోని క్రీడామైదానంలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎం మెషీన్లు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కావలి నియోజకవర్గంలో మొత్తం 314 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 742 మంది పీఓలు, ఏపీఓలు, 1424 మంది ఓపీఓలతో పాటు 105 మంది మైక్రోఅబ్జర్వర్లు పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. సమస్యాత్మకమైన 91 పోలింగ్ కేంద్రాల్లో మైక్రోఅబ్జర్వర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులతో పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టామని తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్వో శీనానాయక్

పోలింగ్ విధులను బాధ్యతగా నిర్వహించండి



సూచనలు చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ఆత్మకూరు : ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ సిబ్బందికి సూచించారు. మున్సిపల్ పరిధిలోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. సిబ్బంది కోసం ప్రత్యేకంగా వాహనాలు సిద్ధంగా ఉన్నాయని, ఆయా రూట్‌ల పరిధిలో కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సాయంత్రానికి చేరుకోవాలన్నారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ఈవీఎంలు, వీవీప్యాడ్‌లను సీల్‌చేసి ఆత్మకూరులోని స్ట్రాంగ్ రూముకు చేర్చే వరకు బాధ్యత వహించాలన్నారు. ఆయన వెంట ఆత్మకూరు ఆర్డీఓ ఉన్నారు.

ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలి



సీతారామపురం: రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటేసి మంచిపాలకులను ఎన్నుకోవాలని మాజీ జెడ్పీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గాజులపల్లి వేణుగోపాల్‌రెడ్డి స్వగృహంలో ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధనకు మండల నాయకులతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు శాశ్వత రాజకీయ గ్రహణం పట్టినందున ఆయనకు ఇవే చివరి ఎన్నికలన్నారు. ప్రస్తుతం పేదల ప్రతినిధి జగన్, పెత్తందారుల ప్రతినిధి చంద్రబాబుకు మధ్యన జరుగుతున్న ధర్మయుద్ధమే ఈ ఎన్నికలన్నారు. అభివృద్ధి, ప్రదాత, సంక్షేమ సారథి జగన్ అంటే ప్రజలకు అపారమైన నమ్మకమన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేశారని తెలిపారు. రాష్ట్రంలోని 87 శాతం మంది ప్రజలకు ఏదోక రూపంలో లబ్ధి చేకూర్చిన జననన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. చంద్రబాబుకు ఓటేస్తే సంక్షేమ పథకాలు కొనసాగవని, పేదల సంక్షేమాన్ని పట్టించుకోడని ఆరోపించారు. పేదరిక నిర్మూలన కేవలం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైనందున ప్రజలంతా మళ్లీ వైఎస్సార్‌సీపీనే ఆదరించాలన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలన, ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనను బేరీజు వేసుకుని ఎవరి హయాంలో మంచి జరిగిందని భావిస్తే వారికి ఓటేయాలని కోరారు. కావలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చేజర్ల సుబ్బారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు, మాజీ ఎంపీపీ కల్లూరి జనార్దన్‌రెడ్డి, గుండుపల్లి, చిన్నాగంపల్లి, బాలాయపల్లి సర్పంచ్‌లు చప్పిడి తిరుపతిరెడ్డి, మునగాల రామచంద్రారెడ్డి, కల్లూరి వెంకటరెడ్డి, మండల నాయకులు గాజులపల్లి వేణుగోపాల్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వంకెల సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, అబ్బిరెడ్డి, రేనాటి సుధాకర్‌నాయుడు, నారాయణరెడ్డి, రమణయ్య, తిరుమలిరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మయ్య, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, దుగ్గిరెడ్డి వెంకటరెడ్డి, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గెలిచి ఓడితే రాజకీయంగా తెరమరుగే

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఎవరైనా ఎమ్మెల్యే గెలిచి ఆ తరువాత ఓడిపోతే వారు రాజకీయంగా తెరమరుగవుతున్నారు. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు పోటీ చేసిన అభ్యర్థుల చరిత్రను ఒక్కసారి పరిశీలన చేస్తే ఈ సెంటిమెంట్ నిజమేననిపిస్తోంది. అయితే ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ నుంచి ఇద్దరూ అభ్యర్థులు కొత్తవారే పోటీ చేస్తున్నారు. దీంతో ఈ సెంటిమెంట్‌కు తెరపడే అవకాశం ఉంది. ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థుల భవిష్యత్ 2029 ఎన్నికల తరువాత తేలే అవకాశముంది. 1952లో నందిపాడు కేంద్రంగా నియోజకవర్గం ఆవిర్భవించింది.

- మొదటిసారిగా ప్రజాపార్టీ నుంచి కోవి రామయ్యచౌదరి పోటీచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బెజవాడ గోపాల్‌రెడ్డిని ఓడించారు. ఆ తర్వాత 1967 ఎన్నికల్లో కోవి రామయ్యచౌదరి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి స్వతంత్ర అభ్యర్థి ధనేందకుల నరసింహం చేతిలో ఓటమిచెందారు. ఆ తర్వాత కోవి రామయ్యచౌదరి నియోజకవర్గ ఎన్నికల్లో నిలవలేకపోయారు.
- 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి మాదాల జానకిరాం పోటీచేయగా, టీడీపీ తరఫున బరిలో నిలిచిన కంభం విజయరామిరెడ్డి ఆయన్ను ఓడించారు. ఆ తరువాత 1994 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కంభం చేతిలో మాదాల జానకిరాం ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన ఉదయగిరి రాజకీయాల్లో కనుమరుగయ్యారు.
- 1994, 1999 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించిన కంభం విజయరామిరెడ్డి 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి చేతిలో ఓటమిచెందారు. 2012 ఉపఎన్నికల్లో మళ్లీ బరిలో నిలిచినప్పటికీ విజయం సాధించలేకపోవడంతో ఆయన తెరమరుగయ్యారు.



సెంటిమెంట్

- 2004, 2009, 2012, 2019 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి ఈ దఫా ఎన్నికల్లో ఏ పార్టీ కూడా సీటు ఇవ్వలేదు.
- 2012 ఉపఎన్నికల్లో రాజకీయ ఆరంగేట్రం చేసిన టీడీపీ అభ్యర్థి బొల్లినేని వెంకటరామారావు 2014 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపై విజయం సాధించారు. ఆ తరువాత 2019 ఎన్నికల్లో మేకపాటి చేతిలోనే బొల్లినేని ఓటమి చెందారు. 2024 ఎన్నికల్లో బొల్లినేనికి టీడీపీ తరఫున సీటు రాలేదు. దీంతో ఆయన రాజకీయ భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంలో పడింది.
- ప్రస్తుతం ఉదయగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున కాకర్ల సురేష్, వైఎస్సార్‌సీపీ తరఫున మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తొలిసారిగా రాజకీయ బరిలో నిలబడుతున్నారు. మొత్తం మీద ఉదయగిరి నియోజకవర్గ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన వారు ఆ తర్వాత ఎన్నికల్లో ఓటమి చెందితే వారు రాజకీయాలకు దూరమవుతున్నారనే సెంటిమెంట్ కొనసాగుతూ వస్తోంది.

ఊరూరా.. ఫ్యాన్ గాలే

కావలి: కావలి పట్టణ కేంద్రం నుంచి నియోజకవర్గంలోని మారుమూల పల్లెల వరకూ ఎక్కడ చూసినా ఫ్యాన్ గాలే బలంగా వీస్తోంది. పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ నియోజకవర్గంలో టీడీపీ పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. జనమంతా ఏకతాటిపైకి వచ్చి ఫ్యాన్ గుర్తుకు ఓటేయడం ద్వారా కావలి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు 'సిద్ధం'గా ఉన్నారు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచే కావలి నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా ఉంది. కావలి పట్టణంతో పాటు మండలం, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో పార్టీ ఆవిర్భావం తరువాత ఇప్పటి వరకూ ఒక్క చోట కూడా ఆధిక్యత లభించలేదు. చివరకు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీని తరిమికొట్టారు. బోగోలు మండలంలో అయితే మొత్తం 16 పంచాయతీలు ఉండగా ఒక్క పంచాయతీలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ చోటు దక్కించుకోలేకపోయింది. ఆ స్థాయిలో కావలి నియోజకవర్గం పార్టీకి కంచుకోటగా ఉంది. 2014, 2019 ఎన్నికల్లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, తప్పుడు కేసులు పెట్టినా కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజయాన్ని అడ్డుకోలేకపోయింది. 2014 ఎన్నికల కన్నా 2019 ఎన్నికల్లో రెండింతలు అధిక మెజార్టీతో ప్రతాప్‌రెడ్డి విజయం సాధించి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. దీంతో కావలి అసెంబ్లీ నియోజకవర్గంపై ఈసారి టీడీపీ ఆశలు వదిలేసుకుంది. కావలి స్థానానికి సత్తా ఉన్న అభ్యర్థులెవరూ ముందుకు రాకపోవడంతో ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన కావ్య కృష్ణారెడ్డికి టికెట్ ఇచ్చింది. కావ్యకు టికెట్ ఇవ్వడం ఇష్టంలేని ఆ పార్టీ తాత్కాలిక ఇన్‌చార్జి మాలెపాటి సుబ్బానాయుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు బీద రవిచంద్ర కూడా మొక్కుబడిగా ప్రచారంలో పాల్గొని మమ అనిపించారు. ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కూడా నియోజకవర్గంపై ఆశలు లేక పెద్దగా ప్రచారంలో పాల్గొనలేదు. మరోవైపు వైఎస్సార్‌సీపీ తరుపున కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి విస్తృత ప్రచారం నిర్వహించారు. వీరి ప్రచారానికి ప్రజలు కూడా బ్రహ్మరథం పట్టారు. మునుపెన్నడూ లేని స్థాయిలో ఒక్కో గ్రామంలో రెండు, మూడు క్రేన్లు ఏర్పాటు చేసి గజమాలలతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. దీంతో నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ నామమాత్రమేనని తేలిపోయింది. కావలి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రతాప్ కుమార్‌రెడ్డి 40వేలపైచిలుకు మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని విశ్లేషకులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా మాతృ దినోత్సవం



ఆత్మకూరు : పట్టణానికి చెందిన శ్రీవాసవి క్లబ్ వారి ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులోని ఎస్ఎస్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లలు వారి తల్లిదండ్రులకు పాదసేవ, పూజా కార్యక్రమాలు చేశారు. తల్లిదండ్రులను గౌరవించాలని, ముఖ్యంగా తల్లి ఆశీర్వాదం పిల్లలు పొందాలని క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

మద్యం అక్రమ రవాణాను అరికట్టాం

- సెబ్ సీఐ రవీంద్ర

ఆత్మకూరు : ఆత్మకూరు సర్కిల్ పరిధిలో మద్యం అక్రమ రవాణాను, నిల్వలను అరికడుతున్నట్లు సెబ్ సీఐ కె.రవీంద్ర తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలైనప్పటి నుంచి 25 రోజుల వ్యవధిలో 49 మద్యం కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో 47 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 1,002 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 78 మందిని బైండోవర్ చేసినట్లు తెలియజేశారు.

ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ తనిఖీ



విద్యుత్ సరఫరాపై అధికారులతో చర్చిస్తున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్ ఆదివారం తనిఖీ చేశారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో కోవూరు నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో విద్యుత్ సరఫరా ఏర్పాట్లను ఎస్ఈ తనిఖీ చేసి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఆయా ప్రాంతాల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్‌ల ఫోన్‌నంబర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా, ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్ కాల్‌సెంటర్ల ఫోన్‌నంబర్లకు తెలియజేయాలని కోరారు. ఆయన వెంట నెల్లూరు టౌన్-2 విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణవేణి, సిబ్బంది ఉన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

నెల్లూరు(బృందావనం): నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఓ హోటల్‌లో రెడ్ల ఐక్య వేదిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత ఇటీవల మృతిచెందిన జీఎస్ రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులైన రెడ్డి సంఘీయులు, కళాకారులు, కవులు, రచయితలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో 591 మార్కులు సాధించిన నెల్లూరుకు చెందిన ఊటుకూరు చరణ్‌కుమార్‌రెడ్డికి ప్రోత్సాహకంగా వెందోటి ధనుంజయరెడ్డి రూ.50 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో రెడ్ల ఐక్యవేదిక నిర్వాహకులు నిర్మల నరసింహారెడ్డి, డాక్టర్ బీవీ రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, వెందోటి ధనుంజయరెడ్డి, సంఘమిత్ర రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామానుజాచార్యుల జీవితం ఆదర్శప్రాయం

నెల్లూరు(బృందావనం): భగవద్రామానుజాచార్యుల జీవితం ఆదర్శప్రాయమని సామాజిక సమరసత వేదిక జిల్లా నిర్వాహకుడు కోదూరు సత్యం తెలిపారు. జిల్లా సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో రంగనాయకులపేటలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న రామానుజాచార్యుల విగ్రహం వద్ద ఆదివారం భగవద్రామానుజాచార్యుల జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలుత రామానుజాచార్యుల విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆ సంస్థ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాసులు, డి.రాజేంద్ర, జయప్రకాష్, సతీష్, మల్లికార్జున, జి.కేశవులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో రామానుజాచార్యుల జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రంగనాయకులపేటలోని రామానుజాచార్యుల విగ్రహానికి పూలమాల వేసి ప్రణమిల్లారు. ఈ సందర్భంగా పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయప్రకాష్ పాల్గొన్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా..



అభివృద్ధి చెందిన ఆత్మకూరు మండలం అరవేడు ప్రాథమిక పాఠశాల

- మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- ఆశ్చర్యానికి లోనవుతున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు : గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌ను తలదన్నేలా రూపుదిద్దుకున్నాయి. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాగానే ఇచ్చిన మాట ప్రకారం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. దీనిలో భాగంగా మనబడి నాడు-నేడు కింద మారుమూల గ్రామాల్లో సైతం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. కాగా ఆయా పాఠశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు ప్రస్తుత ఎన్నికల సందర్భంగా ఊర్లకు వచ్చి మార్పును చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనవుతున్నారు. వీటితో పాటు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలు, ఆస్పత్రుల భవనాలను, ఆధునికీకరించిన పాఠశాలలను చూసి అభివృద్ధి అంటే ఇదే కదా అని వ్యాఖ్యానిస్తూ ముఖ్యమంత్రి జగనన్న విజన్‌కు, విద్యపై ఆయన పెడుతున్న పెట్టుబడికి జేజేలు పలుకుతున్నారు. దీంతో గ్రామాల్లోని చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌ను ఊహించుకుంటూ ఆంగ్ల విద్య సైతం పాఠశాల స్థాయి నుంచే లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





అరవేడు పాఠశాలలో ఆధునికీకరించిన తరగతి గదులు



మోడరన్ టాయిలెట్స్

జగనన్న పాలనను ఆశీర్వదించండి



మాట్లాడుతున్న మాదిగ సంక్షేమ సంఘ సభ్యులు

ఆత్మకూరు : అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను నిండు మనస్సుతో మరోసారి ఆశీర్వదించి తిరిగి అధికారంలోకి వచ్చేలా చేయాలని వివిధ జిల్లాల మాదిగ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు కోరారు. ఆ సంఘ రాష్ట్ర నాయకుడు పెద్దిపోగు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 8 జిల్లాలకు చెందిన సభ్యులు ఆత్మకూరులో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. డప్పు కళాకారులు, చర్మకారులకు పింఛన్ అందజేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మేలును మరువలేమన్నారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే ఎలాంటి సిఫార్సులు లేకుండా పింఛన్లు మంజూరైందన్నారు. దీంతో స్వచ్ఛందంగా తాము పలు జిల్లాల్లో జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు చాట్ల ఉమేష్, ఇతర జిల్లాల కార్యవర్గ సభ్యులు సుబ్బారావు, మహేష్, రాము, దాసు, సురేష్, శ్యామ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- సీఐ రవినాయక్



అధికారులు, రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న సీఐ రవినాయక్

సంగం : మండల పరిధిలో సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్ కోన్నారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సిబ్బందితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. రాజకీయ నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కనులపండువగా శ్వేతఛత్ర ఉత్సవం

- శ్రీతల్పగిరి రంగనాథునికి విశేష తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవీ భూదేవీ సమేత రంగనాథస్వామి

నెల్లూరు(బృందావనం): నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శ్రీభగవద్రామానుజాచార్యుల తిరునక్షత్రం సందర్భంగా ఆదివారం బంగారు పల్లకిలో శ్వేతఛత్ర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం మంగళాశాసనోత్సవం జరిగింది. తదుపరి ఆలయ అర్చకులు శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామికి, శ్రీభగవద్రామానుజాచార్యులకు శాస్త్రోక్తంగా విశేష తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు పెద్ద శేషవాహన ఉత్సవం, శ్రీభగవద్రామానుజాచార్యులకు ఉడయవర్లు తిరిచ్చిలో పేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో శంకరాచార్యుల జయంతి



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులు, కళాకారులు

- ఉచితంగా ఉపనయనాలు

ఆత్మకూరు : పట్టణంలోని విశ్వేశ్వరాలయంలో ఆది గురువు శంకరాచార్యుల జయంతిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ బాలురకు శివాలయ ప్రాంగణంలో ఉచితంగా ఉపనయనాలు నిర్వహించారు. తొలుత ఏపీ అర్చక పురోహిత సంఘం ఉపాధ్యక్షుడు శివకుమార శర్మ నేతృత్వంలో విశ్వేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు గావించారు. అనంతరం ప్రత్యేక వేదికపై శంకరాచార్యుల చిత్రపటం ఉంచి పూజలు జరిపించారు. సర్వదేవతా హోమం అనంతరం ఉపనయనాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయ కళాకారులు చేపట్టిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీమ బ్రాహ్మణసేవా సంఘం కార్యవర్గ సభ్యులు వాకాటి మురళీశర్మ, చంద్రశేఖరశర్మ, చక్రవర్తి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపనయనం చేసిన బాలునితో సంఘ కార్యవర్గ సభ్యులు

పోలింగ్ విధులను బాధ్యతగా నిర్వహించండి



ఆత్మకూరు : సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్, ఆర్డీఓ

- కలెక్టర్ హరినారాయణన్
- సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

ఆత్మకూరు : ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సిబ్బందికి సూచించారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆయన ఆదివారం ఆర్డీఓ, రిటర్నింగ్ అధికారి కె.మధులతతో కలిసి పరిశీలించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు పోలింగ్ బూత్‌లలో విధులు నిర్వహించే సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. సిబ్బంది కోసం ప్రత్యేకంగా వాహనాలు సిద్ధంగా ఉన్నాయని, ఆయా రూట్‌ల పరిధిలో సిబ్బంది సాయంత్రానికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ఈవీఎంలు, వీవీప్యాడ్‌లను సీల్ చేసి ఆత్మకూరులోని స్ట్రాంగ్ రూముకు చేర్చే వరకు బాధ్యత వహించాలన్నారు. భోజనం అనంతరం పోలింగ్ సిబ్బంది తమ సామగ్రిని తీసుకొని ప్రత్యేక బస్సుల్లో బయలుదేరారు.



ఆత్మకూరు: ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసిన అనంతరం సరి చూసుకుంటున్న సిబ్బంది

వసతులపై అసంతృప్తి

ఉదయం 6 గంటలకే డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకున్న ఇతర ప్రాంతాల సిబ్బందికి తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా చేయలేదని, మధ్యాహ్నం భోజనం సైతం సరిపడా అందించలేదని పలువురు సిబ్బంది ఆరోపించారు. కొందరు ఆత్మకూరు నుంచి భోజనం ప్యాకెట్‌లను తెప్పించుకోవవడం కనిపించింది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆర్డీఓను ఇలా చేయడం సరికాదని, ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని తెలియదా అని మందలించినట్లు సమాచారం.

సర్వం సిద్ధం

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండల పరిధిలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. ఓటర్ల కోసం బారికేడ్లను ఏర్పాటు చేయడమే కాకుండా ఎండను తట్టుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద షామియానాలు సైతం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఓటర్లకు తాగునీరు, వైద్యశిబిరం ఏర్పాటు చేశామని వివరించారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారని, వారికి కావాల్సిన అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసు బలగాలు సైతం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

సంగం : మండలంలోని 47 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఆదివారం చేరుకున్నారు. ఈ మేరకు వారికి అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు.

అందంగా ముస్తాబు చేసిన జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల



సర్వాంగ సుందరంగా..



ఆత్మకూరు : పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను అధికారులు పూర్తిస్థాయి మౌలిక వసతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. హిల్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని, అదే విధంగా మేదరివీధిలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల కేంద్రాన్ని సుందరంగా అలంకరించారు. వివిధ రకాల బెలూన్లతో 'పింక్ పోలింగ్ స్టేషన్'గా ప్రాథమిక పాఠశాలను తీర్చిదిద్దారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను మోడల్ పోలింగ్ స్టేషన్‌గా అలంకరించారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కె.మధులత మాట్లాడుతూ ఈసీ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఆమె వివరించారు. ఓటర్లు నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏర్పాట్లు పూర్తి

చేజర్ల : మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీఓ ఎస్.కరిముల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మండలంలో 40 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అన్నింటిలో వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు.



సంగం : పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది



ఆత్మకూరు: ఎన్నికల విధుల కోసం సిద్ధంగా ఉన్న బస్సులు



అనుమసముద్రంపేట : పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన షామియానులు